# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 3-10-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 58 | పేజీలు:4 | వెల: రూ.1/-


## దూసుకొస్తున్న 'షహీన్' తుఫాను.. ఆ రాష్ట్రాల్లో భారీ వర్షాలు

హైదరాబాద్ , అక్టోబర్ 2:గులాబ్ తుఫాను చేసిన బీభత్సం నుంచి తేరుకునేలోపే మరో తుఫాను దూసుకొస్తోంది. అరేబియా సముద్రంలో ఏర్పడిన 'షహీన్' తుఫాను విరుచుకుపడేందుకు వస్తోంది. ప్రస్తుతం ఈ తుఫాను పశ్చిమ వాయువ్య దిశగా గంటకు 15 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని భారత వాతవరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. అల్పపీడనం బలపడి తీవ్ర తుఫానుగా మారినట్టు తెలిపింది. పశ్చిమ– వాయువ్యంగా గుజరాత్‌లోని దేవ్‌భూమి ద్వారకకు 700 కి.మీ, తూర్పు–నైరుతిగా ఇరాన్‌లో చాబర్ పోర్టకు 240కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్టు చెప్పింది.

అక్టోబరు 4 తెల్లవారుజామున ఒమన్ వద్ద తుఫానుగా తీరం దాటుతుందని అంచనా వేసింది. షహీన్ ప్రభావం భారత్ పశ్చిమ తీరంలోని ఏడు రాష్ట్రాలపై ఉంటుందని హెచ్చరించింది. గుజరాత్, బిహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో షహీన్ తుఫాను కారణంగా రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. అక్టోబరు 4 వరకూ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నిత్యం పండుగే : మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్ , అక్టోబర్ 2: సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న పథకాలతో ప్రజలకు నిత్యం పండుగేనని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల, మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండల కేంద్రాల్లో మహిళలకు బతుకమ్మ చీరెలను శనివారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు వచ్చిన మంత్రికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పువ్వులు చల్లుతూ, బతుకమ్మలు, డప్పు, మేళతాళాలతో స్వాగతం పలుకగా.. మంత్రి సైతం బతుకమ్మను ఎత్తుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మహిళలకు చీరెలు పంపిణీ చేసి, తెలంగాణ ఆడబిడ్డలకు ముందస్తుగా బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.స్వరాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వమే పండుగలను నిర్వహిస్తున్నదన్నారు. ఇంటింటికీ పెద్దన్నలా, ఆడబిడ్డలకు మేనమామలా బట్టలు పెట్టి.. పండుగలు నిర్వహించే సీఎంను గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రభుత్వం ప్రజలకు బట్టలు అందజేయడం చరిత్రలో ఎక్కడా లేదన్నారు.

రంజాన్, క్రిస్మస్, బతుకమ్మ పండుగలకు సీఎం కేసీఆర్ బట్టలు పెట్టే ఆనవాయితీని కొనసాగిస్తున్నారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.46.96కోట్ల విలువైన 13.45లక్షలకుపైగా చీరెలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమంలో ఆయా జిల్లాల కలెక్టర్లు, వివిధశాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## జల్ జీవన్ మిషన్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన ప్రధాని

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:ప్రధాని నరేంద్రమోదీ ఇవాళ రాష్ట్రీయ జల్ జీవన్ కోశ్ ఐ జల్ జీవన్ మిషన్ మొబైల్ అప్లికేషన్‌ను ఆవిష్కరించారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొబైల్ యాప్‌ను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రధాని.. ఈ జల్‌జీవన్ మిషన్ అనేది పూర్తిగా గ్రామాలు నడిపించే, గ్రామాల్లోని మహిళలు నడిపించే ఉద్యమం అని వ్యాఖ్యానించారు. మాస్ మూవ్‌మెంట్, పబ్లిక్ పార్టిసిపేషనే దీనికి ప్రధాన ఆధారమని చెప్పారు.

జల్‌జీవన్ మిషన్ మొబైల్ యాప్ ద్వారా ఈ ఉద్యమానికి సంబంధించిన సమస్త సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంటుందన్నారు. ఇక నుంచి దేశంలోని లక్షల గ్రామాల ప్రజలు గ్రామ సభల ద్వారా జల్ జీవన్ సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటారని చెప్పడం ఇప్పుడు నాకు ఎంతో సంతోషంగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ ఉద్దేశం కేవలం ప్రజలకు నీటి సౌకర్యాలు కల్పించడం మాత్రమే కాదని, ఇదొక పెద్ద వికేంద్రీకరణ ఉద్యమమని ఆయన చెప్పారు.

## మహాత్మాగాంధీకి తెలంగాణ సర్కార్ ఘన నివాళి

హైదరాబాద్ , అక్టోబర్ 2: భారత జాతిపిత మహాత్మాగాంధీ 152వ జయంతి వేడుకలు లంగర్ హౌస్‌లోని బాపూ ఘాట్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మహాత్ముడికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.

మహాత్ముడికి నివాళులర్పించిన వారిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, మంత్రులు మహమూద్ అలీ, కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సత్యవతి రాథోడ్, రాజ్యసభ సభ్యులు కే కేశవరావు, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, జీవన్ రెడ్డి, ముఠా గోపాల్, దానం నాగేందర్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవీ, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## దిగి వచ్చిన కేంద్రం.. పంజాబ్, హర్యానాలో రేపటి నుంచి ధాన్యం కొనుగోలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 2: రైతుల నిరసనతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. పంజాబ్, హర్యానాలో ఆదివారం నుంచి ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపింది. పంజాబ్, హర్యానాలో రైతుల నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ శుక్రవారం నుంచి ప్రారంభం కావాల్సి ఉన్నది. అయితే కేంద్ర ప్రభుత్వం దీనిని అక్టోబర్ 11 వరకు వాయిదా వేసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంట పరిపక్వత ఆలస్యమైందని పేర్కొంది.

కాగా, కేవలం పంజాబ్, హర్యానాలో మాత్రమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలును కేంద్రం ఆలస్యం చేయడంపై రైతులు, ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ నేపథ్యంలో శనివారం హర్యానా, పంజాబ్‌లో రైతులు నిరసన చేపట్టారు. హర్యానాలోని అధికార బీజేపీ, జేపీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎం ఇండ్ల ముందు ఆందోళన చేశారు. రైతుల నిరసనను భగ్నం చేసేందుకు పోలీసులు నీటి ఫిరంగులు ప్రయోగించారు. పంజాబ్‌లోని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల వద్ద కూడా రైతులు నిరసన తెలిపారు.

రైతుల ఆందోళనతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చింది. పంజాబ్, హర్యానాలో ఆదివారం నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే శనివారం తెలిపారు. ఈ అంశంపై తనను ఢిల్లీలో కలిసిన హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్‌తో కలిసి ఈ మేరకు సంయుక్తంగా ప్రకటించారు.

## పురాతన చేతి వృత్తిని కాపాడుతున్న కృష్ణకు.. మంత్రి కేటీఆర్ అండ

హైదరాబాద్ , అక్టోబర్ 2:తెలంగాణలో అంతరించి పోతున్న పురాతన చేతి వృత్తిని కాపాడుతున్న కృష్ణకు, మంత్రి కేటీఆర్ అండగా నిలిచారు. ఆయనకు అవసరమైన సహాయాన్ని అందించాలని హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కార్యదర్శికి సూచించారు. హైదరాబాద్‌లోని అబిడ్స్‌కు చెందిన 55 ఏండ్ల పీ కృష్ణ, అంతరించిపోతున్న బ్లాక్ ప్రింటింగ్ సంప్రదాయాన్ని దశాబ్దాలుగా కొనసాగిస్తున్నారు. కరోనా సంక్షోభంలో చిన్న తరహా పరిశ్రమలు కుదేలైనప్పటికీ ఆయన ఈ చేతి వృత్తిని వీడలేదు.

శతాబ్దాల నాటి బ్లాక్ ప్రింటింగ్ కళను సజీవంగా ఉంచుతున్న తెలంగాణలోని అతి కొద్ది మంది వ్యక్తులలో కృష్ణ ఒకరు. హస్త కళాకారులకు తీసిపోని ఈ వృత్తిలోకి ఆయన ప్రవేశించి 25 ఏండ్లు దాటింది. స్వచ్ఛమైన పట్టు, కాటన్ ఫ్యాబ్రిక్స్‌పై క్లిష్టమైన, ఆకర్షణీయమైన డిజైన్లను తన చేతితో అద్భుతంగా సృష్టిస్తారు. దీని కోసం ఆయన ఎంతో శ్రమిస్తారు. హ్యాండ్ బ్లాక్ ప్రింట్ ఫ్యాబ్రిక్‌ను తయారు చేయడానికి కొన్నిసార్లు చాలా గంటలు లేదా రోజుల తరబడి పని చేస్తారు. ఈ చీరల ప్రింటింగ్‌కు బయట మార్కెట్‌లో వేలల్లో తీసుకుంటారు. కానీ, ఇప్పటికీ కృష్ణ రూ.300కే హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్ చేస్తున్నారు. ఒక ఆర్డర్‌కు సుమారు రూ.150 మాత్రమే ఆయన సంపాదిస్తారు. 'హ్యాండ్ బ్లాక్ ప్రింట్ చీర లేదా ఏదైనా ఫ్యాబ్రిక్ మార్కెట్లో రూ.1,000కి అమ్ముతున్నారు. నేను దానిని కేవలం రూ.300కే అమ్ముతున్నాను. నేను నెలకు ఐదు కంటే ఎక్కువ ఆర్డర్‌లను స్వీకరించను' అని కృష్ణ తెలిపారు. దీంతో ఆయన నెలంతా కష్టపడినా వెయ్యి అయినా సంపాదించలేకపోతున్నారు.ప్రింటింగ్ మెషీన్ల రాకతో ఈ వృత్తి ఇప్పుడు స్తంభించిపోయిందని కృష్ణ చెప్పారు. తనలాంటి వారు కొందరు మాత్రమే ఈ పురాతన హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్‌ను కొనసాగిస్తున్నారని వెల్లడించారు. మరోవైపు 55 ఏండ్ల కృష్ణను కరోనా మహమ్మారి కుదిపేసింది. ఆర్డర్లు లేక ఆయన సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు.కాగా, కృష్ణ కష్టాల గురించి తెలుసుకున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీ రామారావు ఆయనకు సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ సెక్రటరీకి ఆయనను కనెక్ట్ చేశారు. దీంతో తన కష్టాలు తీరుతాయని కృష్ణ ఆశిస్తున్నారు. పురాతన చేతి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కృష్ణకు మనం కూడా అండగా నిలువవచ్చు. ఈ పండుగ సీజన్‌లో హ్యాండ్ బ్లాక్ ప్రింట్‌కు ఆర్డర్లు ఇచ్చి ఆయనను ఆదుకోవచ్చు. వివరాల కోసం 83091 81998 మొబైల్ నంబర్‌లో కృష్ణను సంప్రదించవచ్చు.

## బూర్గుల భవన్‌లో మంత్రి సత్యవతి రాథోడ్ నేతృత్వంలోని క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం



హైదరాబాద్ , అక్టోబర్ 2:పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల రాష్ట్ర గిరిజన, స్త్రీ– శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ( రాజీబిఎజీలజీబితి ఖీజీబిప్త్రనీట ) అధ్యక్షతన క్యాబినెట్ సబ్‌కమిటీ వేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీలో రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, అజయ్ కుమార్ సభ్యులుగా ఉన్నారు. అయితే, తమకు అప్పగించిన బాధ్యతలపై చర్చించడం కోసం ఇప్పటికే రెండు సార్లు సమావేశమైన కమిటీ.. ఇవాళ మూడోసారి సమావేశమైంది. బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో ఈ సమావేశం జరుగుతున్నది. ఈ క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి క్రిస్టినా, అటవీ శాఖ పీసీసీఎఫ్ శ్రీమతి శోభ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్ కారును ఆపేసిన పోలీసులు!

హైదరాబాద్ , అక్టోబర్ 2:రూల్ ఈజ్ రూల్.. రూల్ ఫర్ ఆల్.. అనే నానుడిని హైదరాబాద్ పోలీసులు ఆచరణలో చేసి చూపించారు. వివరాల్లోకి వెళ్లితే.. గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని బాపు ఘాట్‌కు వెళ్లి తిరిగొస్తుండగా మంత్రి కేటీఆర్ కారును స్థానిక ట్రాఫిక్ పోలీసులు ఆపేశారు. బాపూజీ ఘాట్‌లో నివాళులు అర్పించేందుకు గవర్నర్లు బండారు దత్తాత్రేయ, తమిళిసైతోపాటు మంత్రి కేటీఆర్ కూడా వచ్చారు. కార్యక్రమం అనంతరం గవర్నర్ కాన్వాయ్ బయటికెళుతుండగా.. ఆ రూట్‌లో వెళ్లకుండా కేటీఆర్ కాన్వాయ్.. రాంగ్ రూట్ తీసుకుంది. దీంతో కేటీఆర్ కారును ట్రాఫిక్ పోలీసు అధికారి అడ్డుకున్నారు. రాంగ్ రూట్‌లో వస్తున్నారు.. ఇక్కడ మీకు అనుమతి లేదంటూ కారును ఆపేశారు. దీంతో టీఆర్ఎస్ కార్యకర్తలు ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అయితే, కేటీఆర్ కాన్వాయ్‌లోని ఓ కారును ఆపేశారా..? లేదా ఆపిన కారులోనే మంత్రి ఉన్నారా..? అనే విషయం మాత్రం స్పష్టం లేదు.




## ఒకే కుటుంబానికి చెందిన నలుగురి నరికివేత..!

రాంచి, అక్టోబర్ 2:: జార్ఖండ్ రాష్ట్రంలోని సింగ్‌భూమ్ జిల్లాలో దారుణం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులను గుర్తుతెలియని దుండగులు అత్యంత కిరాతకంగా గొడ్డలితో నరికి హత్యచేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. సింగ్‌భూమ్ జిల్లాలోని కెండపోసి గ్రామంలో ఒనాము ఖండైట్ అనే వ్యక్తి తన భార్య మణి, తమ్ముడు గొబ్రూ, మైనర్ అయిన కొడుకుతో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఆ నలుగురు తమ పంటపొలాల్లోనే శవాలయ్యారు. ఉదయం పొలంవైపు వెల్లిన గ్రామస్తులకు నలుగురూ విగతజీవులుగా పడి కనిపించారు. కుటుంబంలోని నలుగురినీ గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో నరికిచంపారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి హత్యలకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. భూతగాదాలే హత్యలకు కారణమని తమ ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు చెప్పారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ బూతికల కుందనమ్మై
'గొసిందునిరామ శాస్త్రి' కువలయమెల్లన్
భావనలూనింపి సుధువ
గొవిందుడు మెచ్చి ఖ్యాతి కోటిక లుడెన్!!

( అక్టోబర్ 3 గోరా శాస్త్రి జయంతి..)

–రాధశ్రీ

సెల్: 9494481210



## పేద ఇంటి ఆడపడుచులకు ప్రభుత్వ కానుక బతుకమ్మ చీరెలు: మంత్రి ఎర్రబెల్లి

జనగామ, అక్టోబర్ 2:: పేద ఇంటి ఆడపడుచులకు ప్రభుత్వ కానుక బతుకమ్మ చీరెలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం జిల్లాలోని దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల మండల కేంద్రాల్లో బతుకమ్మ చీరేల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వమే ప్రజల పండుగలని నిర్వహిస్తున్నదని అన్నారు.

రూ. 333 కోట్ల ఖర్చుతో రాష్ట్రంలోని ప్రతి అక్క, చెల్లె, అమ్మకు చీరెలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏడు సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. రెండు సంవత్సరాలుగా కరోనాతో ఎంతో ఇబ్బందిపడ్డామని అన్నారు. "రాష్ట్ర ఆదాయం లేదు, అన్ని వ్యవస్థలు బంద్ అయి, ఒకరినొకరు పలకరించే పరిస్థితి లేకుండా అయింది" అని దయాకర్ రావు అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఇన్ని సంక్షేమ పథకాలు లేకపోయినా, కరోనా సమయంలో సంక్షేమ పథకాలను అమలు చేయలేదని గుర్తుచేశారు. కానీ, పేదల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి మాత్రం కష్టకాలంలో అప్పు తెచ్చి మరీ, పేదలకు ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి ఇచ్చారని చెప్పారు.

కరోనా సమయంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ అందుబాటులో ఉంచామన్నారు. ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన అన్నారు. ఎర్రబెల్లి ట్రస్ట్ తరపున నియోజకవర్గంలో మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసినట్లు, 50 లక్షలు ఖర్చు పెట్టి ఆనందయ్య మందు ఇంటింటికి అందజేసినట్లు ఆయన తెలిపారు. 40 వేల కోట్లు ఖర్చుపెట్టి గోదావరి నీటిని శుద్ధిచేసి ఇంటింటికి నల్లా ద్వారా అందజేస్తున్న మహానుభావుడు కేసీఆర్ అని ఆయన అన్నారు. ఆసరా పెన్షన్లు రూ.రెండు వేల పదహారుకు పెరగగా, ఇంటిలో పెద్ద వారికి గౌరవం పెరిగిందని ఆయన అన్నారు. వచ్చే నెల నుండి 57 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్లు మంజూరు చేస్తామని, ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇళ్లు కూడా కట్టి ఇచ్చే పథకం ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

కరోనా వ్యాక్సిన్ ఇంటింటికి ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పిన ఆయన.. వ్యాక్సిన్ తీసుకొని జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. వ్యాక్సిన్ తీసుకుంటే కరోనా వచ్చినా ప్రాణాపాయం ఉండదని, త్వరగా తగ్గిపోతుందని వివరించారు. జిల్లాలో 3 లక్షల మందికి మొదటి డోసులు, 80 వేల మందికి రెండు డోసులను ఇప్పటికే ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సీహెచ్. శివలింగయ్య మాట్లాడుతూ, జిల్లాలో 2 లక్షల చీరెలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ. 8 కోట్ల 50 లక్షలు ఉంటుందని చెప్పారు. 24 డిజైన్లు, 810 రంగులతో చీరెలు ఉన్నట్లు వెల్లడించారు. తెలంగాణా సంస్కృతిలో భాగమైన బతుకమ్మను అందరూ సంబరంగా జరుపుకోవాలన్నారు.

కార్యక్రమానికి ముందు జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి మంత్రి, కలెక్టర్లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మంత్రిపై మహిళలు పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. బతుకమ్మలతో, డప్పులు, మేళతాళాలతో సంప్రదాయ బద్ధంగా ఎదురేగారు. మంత్రి, జిల్లా కలెక్టర్ బతుకమ్మ ను ఎత్తుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అబ్దుల్ హమీద్, డీఆర్డీవో జి. రాంరెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్. విజయలక్ష్మి, డీపీవో కె. రంగాచారి, ఏడీ హ్యాండ్లూమ్ ఎస్. కళ్యాణి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జీవవైవిధ్యానికి నెలవులు వన్యప్రాణులు

## (అక్టోబర్ 8 వరకు 'ప్రపంచ వణ్యప్రాణి వారోత్సవాల' సందర్భంగా)

మనిషికి ఊపిరితిత్తులు ఎంత ముఖ్యమో భూగోళ పర్యావరణానికి అటవీ సంపద అంతే ప్రధానం. అటవీ సంపదలో దట్టమైన హరిత సంపదలు మరియు అందులో అంతర్భాగమైన జీవజాతులు లేదా వన్యప్రాణులు వస్తాయి. అడవుల్లో ఉండే జంతు మరియు వృక్షజాలం మానవాళికి వెలకట్టలేని మేలును చేస్తున్నది. మానవ ప్రమేయం లేకుండా స్వతంత్రంగా అడవులలో జీవించే వృక్ష మరియు జంతుజాలాన్ని వన్యప్రాణులుగా పిలుస్తారు. వన్యప్రాణుల్లో భారీ ఏనుగులు, జిరాఫీలు, రైనోలతో మె?దలు పక్షులు, క్రిమికీటకాలు మరియు సూక్ష్మజీవులు వస్తాయి. 1952లో ఏర్పాటు చేసిన భారత "జాతీయ వన్యప్రాణుల మండలి" చొరవతో వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 తీసుకువచ్చి దేశవ్యాప్తంగా వన్యప్రాణి సంరక్షణ కార్యక్రమాలు ఉద్యమంలా సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా వన్యప్రాణులను అటవీ సంపదగా కాపాడుకుంటూ, జీవ వైవిధ్యాన్ని పదిలపరుచుకోవాలనే అవగాహన సమాజంలో కల్పించడానికి ప్రభుత్వాలు, పభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంధ కార్యకర్తలు కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. వన్యప్రాణులను ఆహారంగానే కాకుండా జంతు అవయవాలు మరియు కలప అక్రమ వ్యాపారం కోసం చట్టాలను ఉల్లంఘించి వేటాడం/నరకడం జరుగుతోందనేది కఠిన వాస్తవం. వన్యప్రాణి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించే సదుద్దేశంతో ప్రతి ఏటా భారత ప్రభుత్వం అక్టోబర్ 2 నుండి 8 వరకు "ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాల"ను ప్రతిష్టాత్మకంగా చేబడుతున్నది. అడవుల నరికివేతను కట్టడి చేస్తూ, జాతీయ ఉద్యానవనాలు, జీవావరణ నిల్వలు, వన్యప్రాణి అభయారణ్యాలు ఏర్పాటు చేయడం ద్వారా జీవ వైవిధ్యం కాపాడబడి, పర్యావరణ పరిరక్షణకు ఊతం ఇస్తుందన్న అవగాహన కలిగి ఉండాలి. 67వ ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాలు-2021 నినాదంగా "అడవులు, జీవనోపాధులు : సుస్థిర ప్రజలు మరియు గ్రహం కోసం (ఫారెస్ట్ అండ్ లైవ్లీవుడ్ : పీపుల్ అండ్ ప్లానెట్)" అనబడే అంశం తీసుకోబడింది.

### ప్రపంచ వన్యప్రాణ సంపద:

ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా 5,500 రకాలైన జీవజాతులను పలు స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమంగా విక్రయిస్తున్నారని తేలింది. వన్యప్రాణుల పరిరక్షణతోనే జీవ వైవిధ్యం నెలకొంటూ, కాలుష్యం తగ్గించబడి, పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతుంది. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీ శాఖ నేతృత్వంలో సదస్సులు, సమావేశాలు, కార్యశాలలు, పలు రకాలైన పోటీలు, గోడ పత్రికల విడుదల, వీధి నాటికలు, జంతు మరియు పక్షుల ప్రదర్శనశాల (జూలు) సందర్శనలు, వన సందర్శనలు, వనమహోత్సవాలు, వన్యప్రాణి పుస్తక పఠనం, వన్యప్రాణుల వీడియోలు చూపించడం, స్వచ్ఛ భారత్, పర్యావరణ వేత్తలతో ముఖాముఖి లాంటి వేదికల ద్వారా ప్రజలకు మరియు విద్యార్థి లోకానికి వన్యప్రాణుల పరిరక్షణ అవసరాన్ని వివరిస్తారు. ఈ వారోత్సవాలలో వన్యప్రాణి పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు, చట్టాల అమలులో పటిష్టత, అవసరమైన నూతన చట్టాల రూపకల్పన, జీవ సంరక్షణ అవసరం, అభయారణ్యాల ఏర్పాటు, జాతీయ ఉద్యానవనాల స్థాపన, అడవుల నరివేతను వ్యతిరేకించడం వంటి అంశాలలో లోతైన చర్చలు జరపాలి.

### భారత వన్యప్రాణుల సంపద:

ఇండియాలోని అడవుల్లో 91,797 రకాలైన జంతుజాతులు మరియు 46,340 రకాల వృక్షజాతులు ఉన్నది. వీటికి తోడుగా 2,634 రకాల చేపల జలజాతుల సంపద మన దేశంలో ఉన్నది. ప్రపంచంలోని జీవజాతుల్లో 80 శాతం వరకు జీవవైవిధ్యం కలిగిన జంతు సంపద మన దేశంలోనే ఉంది. వీటిలో క్షీరదాలు, పక్షులు, సరిస్పృపాలు, ఉభయచరాలు లాంటి జీవుల అపారసంపద మన అడవులకు మరియు మానవాళికి ఎనలేని సేవలందిస్తున్నాయి. ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణాన కేరళ అడవుల వరకు అపార జీవ వైవిధ్యంతో అటవీ గొర్రెలు మరియు మేకలు, పులులు, చిరుతలు, అడవి దున్నలు మరియు గేదెలు, అటవీ పిల్లులు, జింకలు, లంగూర్స్, కోతులు, గాడిదలు, ముళ్ళ పందులు, దుప్పులు, కుందేళ్లు, నక్కలు, ముంగీసలు, హైనాలు, గబ్బిలాలు, కుక్కలు, పలు రకాల పాములు, మె?సళ్లు, ఒంటెలు, ఏనుగులు, సింహాలు, తాబేళ్లు, బల్లులు, వైవిధ్యభరిత 2000 రకాల పక్షులు, ఖడ్గమృగాలు, అపార క్రిమికీటకాలు లాంటి అనంఖ్యాక జంతుజాలం మన అడవుల సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. మన జాతీయ జంతువుగా టైగర్ మరియు జాతీయ పక్షిగా నెమలి గుర్తించబడినవి. మన దేశంలో అనేక అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు, జంతు నిల్వల అడవులు ఉన్నాయి. టైగర్ ప్రాజెక్ట్ పథకంలో భాగంగా 21 టైగర్ రిజర్వులు నిర్వహించబడుతున్నాయి. అతి పెద్ద జీవ వైవిధ్యం కలిగిన 12 దేశాలలో భారత్ ఒకటిగా పేరు తెచ్చుకుంది. మన దేశంలోని ఈస్టర్న్ హిమాలయాలు మరియు వెస్టర్న్ ఘాట్స్ అంతర్భాగంలో ప్రపంచపు 20 శాతం జంతుజాలం ఉంది. ఇండియాలో 3.64 శాతం భారత భూభాగంలో 1.2 లక్షల చదరపు కిలోమీటర్ల పరిధిలో 553 అభయారణ్యాలు ఉన్నాయి.

### వన్యప్రాణి పరిరక్షణ చర్యలు:

స్వార్థపూరిత మానవుడు వన్యప్రాణుల అక్రమ వ్యాపారం పేరుతో పలు రకాలైన క్షీరదాలు, సరీసృపాలు, పక్షులు మరియు చేపలను వేటాడుతూ, జీవ వైవిధ్యానికి ఎనలేని నష్టాన్ని కలిగిస్తున్నాడు. జీవ సమతుల్యతకు, పర్యావరణ పరిరక్షణకు, ఆహార చక్ర గమనానికి, జీవ వైవిధ్య పరిపుష్టికి, వృక్షరాజ్య విస్తరణకు, పర్యావరణ శుద్ధికి, వన్య జంతువు సంతాన స్థిరాభివృద్ధికి, పలు రకాలైన కాలుష్యాల కట్టడికి, వృక్షజంతుజాలల వైవిధ్యానికి కాపాడటానికి, పర్యాటకరంగ అభివృద్ధికి, క్రీడలు(ఫిషింగ్, వేట) పరిశోధనలు మె?దలగు అంశాలకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గమనించాలి. వన్యప్రాణుల పరిరక్షణతో పలు అటవీ ఉత్పత్తులైన ఔషధాలు, తేనె, పట్టు, వెంట్రుకలు, ఈకలు, తోలు, చర్మాలు, దంతాలు (చనిపోయిన తరువాత) వంటివి లభిస్తాయి. వన్యప్రాణుల నుండి వంట చెరుకు, కలప, పండ్లు, కాయలు, పువ్వులు, జిగురు లాంటి ఉత్పత్తులు కూడా ప్రత్యేక్షంగా లభిస్తాయి. మన సంస్కృతితో భాగంగా ఏనుగు శిక్ష రస్సుగల గణపతి వెంట ఎలుక, దుర్గమాత వెంట పులి, సరస్వతి వెంట నెమలి, శ్రీరాముని వెంట వానరులు మరియు ధైర్యసాహసాలకు ప్రతీకగా సింహం, శివుని మె?డలో నాగుపాము వంటి జంతువుల సాహచర్యంతో వన్యప్రాణి ప్రాముఖ్యతలను ఆధ్యాత్మిక పాఠంగా బోధిస్తున్నాయి.

వన్యప్రాణులతో మానవాళికి ప్రాణభయం, వాహనాల ధ్వంసం, సాధుజంతులపై దాడి, పంటచేను విధ్వంసం, క్రిమికీటకాలతో పంట తెగుళ్ళ వంటి నష్టాలు కూడా ఉన్నాయి. అడవుల నరికివేత, పోడు వ్యవసాయం, ప్రకృతి వైపరీత్యాలు (అడవులు కాలిపోవడం, భూకంపాలు, వరదలు, తీవ్ర కరువు లాంటి), పారిశ్రామికీకరణ, డ్యాముల నిర్మాణం, రోడ్లు వేయడం, రైలు మార్గాలు, జలాశయాల రూపకల్పన, అక్రమ సంపాదనకు జంతు వేట, అటవీ సంపద దుర్వినియోగం, పర్యావరణ కాలుష్యం, భూతాపం, ఓజోన్ పొర పలుచబడడం లాంటి కారణాలతో అటవీ జంతుజాలానికి ప్రమాదం పొంచి ఉన్నది. సాధారణ జాతులు, విపత్తులో ఉన్న జాతులు, హానికర స్థితిలో ఉన్న జాతులు, అరుదైన జాతులు, అంతరించి పోయిన జాతులు వంటి పలు రకాలైన వన్యప్రాణులు ప్రమాద హెచ్చరికలు చేస్తున్నాయి. అంతరించి పోయిన వర్గంలో తెలుపు హెరోన్, స్యాండ్‌పైపర్, సైబేరియన్ క్రేన్, తెలుపు వల్చర్, సాఫిష్, రెడ్ టర్టిల్, రాక్ ర్యాట్, పాండిచ్చెరి షార్క్, రీనోసీరోస్, చేపలు తినే మె?సళ్ళు మొదలగు పలు జీవజాతులు ఉన్నాయి.

వన్యప్రాణి సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన జాతీయ ఉద్యానవనాలలో ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పులుల రక్షణ పార్క్, యూపీలోని దుద్వా కోతుల పార్క్, గుజరాత్‌లోని సింహాల ఘిర్ పార్క్, యంపీలోని కన్హా జింకల మరియు శివపురి వోల్వ్ పార్కులు, ఒడిసాలోని సిమిలిపాల్ పులుల పార్క్, సుందర్‌భన్, మానస్ లాంటి అనేక జాతీయ ఉద్యానవనాలు జీన వైవిధ్యాన్ని కాపాడుతున్నాయి. వీటితో పాటు మన దేశంలో వన్యప్రాణి అభయారణ్యాలుగా దచిగమ్(జమ్ము-కాశ్మీర్), రాజాజీ (ఉత్తరాఖండ్),బన్‌బాస (అస్సాం), రాథంబోర్ మరియు సరిస్కా(రాజస్థాన్), కవల్(మహారాష్ట్ర), చండకా(ఒడిసా), పోచారం- ఏటూర్‌నాగారం(తెలంగాణ), బండీపూర్(కర్నాటక), గిండీ మరియు మధుమలై(తమిళనాడు), పెరియార్ (కేరళ) వంటివి పేరొందినవి. భారత్‌లో పులులు, ఏనుగులు, తాబేళ్ళు మరియు మె?సళ్ళను కాపాడేందుకు అటవీ ప్రాజెక్టులు ఉన్నాయి.

అంతరించే ప్రమాదంలో ఉన్న జంతువుల ఆవాసాలను కాపాడడం, అక్రమ వేటను అరికట్టడం, పోడు వ్యవసాయానికి ప్రత్యామ్నాయాలు వెదకడం, జాతీయ ఉద్యానవనాల ఏర్పాటు, అభయారణ్యాల నిర్వహణ, ఫారెస్ట్ రిజర్వుల యజమాయిషీ, అటవీ చట్టాలను కఠినంగా అమలు చేయడం, అక్రమ అడవుల నరికివేతను అడ్డుకోవడం, అడవుల్లో మానవ రవాణ వ్యవస్థలను చేపట్టకపోవడం, విపత్తులో ఉన్న జీవ జాతుల పునరుత్పత్తికి చర్యలు తీసుకోవడం, అడవుల్లో పెద్ద ఎత్తున మె?క్కలు నాటడం లాంటి చర్యలు చేపట్టడం ద్వారా వన్యప్రాణుల సంరక్షణకు బీజాలు పడతాయి. వనానికి అందాన్నిచ్చే దట్టమైన వృక్షాలు మరియు అనేక రకాల జంతు జాతులు సకల మానవాళికి జీవవైవిధ్యం కల్పిస్తూ అపూర్వ సేవలు అందిస్తున్నాయి. జీవవైవిధ్యానికి విఘాతం కలిగితే కరోనా లాంటి విశ్వ మహమ్మారులు విజృంభిస్తాయని మన ఎదుర్కొంటున్న చేదు అనుభవాలు తెలుపుతున్నాయి. భూమిని నివాసయోగ్యం గ్రహంగా కాపాడుకున్నపుడే భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకర వాతావరణంలో నివసించగలుగుతారు. జీవకోటి సమతుల్యత కోసం వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తించాలి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# టెలి కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కె. రాజారామన్



న్యూఢిల్లీ, అక్టోబర్ 2: భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి అన్షు ప్రకాష్ ఐఎఎస్ (యుటిః 86) పదవీకాలం 30 సెప్టెంబర్ 2021న పూర్తి కావడంతో ఆ స్థానంలో కె. రాజారామన్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాల శాఖ, పెట్టుబడులుడ మౌలిక సదుపాయాల అదనపు కార్యదర్శిగా పని చేశారు.

తమిళనాడు కేడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల అధికారి కె. రాజారామన్. ఆయన కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శిగా, ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యయ శాఖ సంయుక్త కార్యదర్శిగా పని చేశారు. తమిళనాడు ప్రభుత్వంలో ఆయన చెన్నై మెట్రో రైల్వే లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, వాణిజ్య పన్నుల కమిషనర్ సహా పలు కీలక పదవులను నిర్వహించారు.

# 19 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ది స్టేట్ న్యూట్రిషన్ ప్రొఫైల్స్'

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:నీతి ఆయోగ్, ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎఫ్‌పిఆర్‌ఐ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపీఎస్), యునిసెఫ్ మరియు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ (ఐఈజీ) లతో కలిసి సంయుక్తంగా 30 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల కోసం 'ది స్టేట్ న్యూట్రిషన్ ప్రొఫైల్స్'ను 30, సెప్టెంబర్, 2021 ప్రారంభించింది. ఐఎఫ్‌పిఆర్‌ఐ నిర్వహించిన "భారతదేశంలో పోషకాహారంపై పురోగతి: జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఫేజ్ -1)" అనే వెబ్‌నార్‌లో నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేశ్ సర్వాల్ రాష్ట్ర పోషకాహార ప్రొఫైల్‌లను విడుదల చేశారు.

'స్టేట్ న్యూట్రిషన్ ప్రొఫైల్స్' (ఎస్ఎన్‌పిలు) ఎన్ఎఫ్‌హెచ్ఎస్- 3, 4 మరియు 5 రౌండ్ల ఆధారంగా పోషకాహార ఫలితాలు, తక్షణ మరియు అంతర్లీన నిర్ణయాలు మరియు కార్యక్రమాలపై సవివరమైన జాబితాను ఇస్తాయి. స్టంటింగ్, రక్తహీనత, తక్కువ బరువు మరియు అధిక బరువు మరియు ఎన్‌సిడిలు (డయాబెటిస్ మరియు అధిక రక్తపోటు) వంటి కీలక సూచికల ధోరణి విశ్లేషణ జిల్లాల వ్యాప్తంగా పనితీరు యొక్క వైవిధ్యాన్ని ప్రదర్శిస్తుంది. దేశంలోని అత్యుత్తమ మరియు అధ్వాన్నమైన జిల్లాలు, అత్యధిక భారం ఉన్న జిల్లాలు మరియు టాప్ కవరేజ్ జిల్లాలను ఈ నివేదికలు హైలైట్ చేస్తాయి. డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాల ప్రకారం ప్రజారోగ్య సమస్యలతో రాష్ట్రంలోని ప్రాధాన్య జిల్లాలు మరియు జిల్లాల సంఖ్యను గుర్తించడంలో సహాయపడే జాబితాను అందించడానికి ఎన్ఎఫ్‌హెచ్ఎస్ -5 నుండి డేటా ఆధారంగా హెడ్‌కౌంట్-ఆధారిత విశ్లేషణలు మరియు ఎన్ఎన్‌పిలు ఆధారపడి ఉంటాయి. ప్రతి ఎస్ఎన్‌పి పిల్లలు, మహిళలు మరియు పురుషుల కోసం కీలకమైన సమాచారాన్ని కలిగి ఉంటుంది మరియు రాష్ట్రం మరింత మెరుగుపడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తిస్తుంది. ఆరోగ్యం మరియు పోషకాహార ఫలితాలు మరియు నిర్ణయాధికారుల ఎన్ఎఫ్‌హెచ్-5 విశ్లేషణపై ప్రముఖ వక్తలు (దివ్య నాయర్, ఐడిన్‌సైట్; దివిజ్ సిన్హా, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్; షీలా వీర్, పబ్లిక్ హెల్త్ న్యూట్రిషన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ మరియు రస్మి అవుల,ఐఎఫ్‌పిఆర్‌ఐ; ఎస్.కె. సింగ్, ఐఐపీఎస్; రాబర్ట్ జాన్సన్, యునిసెఫ్; విలియం జో, ఐఈజీ) భాగస్వామి సంస్థల నుండి ప్రదర్శన అందించారు . ఈ వెబ్‌నార్‌లో వివిధ సంస్థల నుండి 200 మందికి పైగా పాల్గొన్నారు. ఎస్ఎన్‌పిలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి:

# కేసీఆర్ నగర్‌లో మరో 360 డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రారంభం

సిద్దిపేట, అక్టోబర్ 2: : సిద్దిపేట పట్టణం కేసీఆర్ నగర్‌లో మూడో విడుతలో భాగంగా మరో 360 డబుల్ బెడ్రూం ఇండ్లలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు లబ్ధిదారుల చేత గృహ ప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ కమ్యూనిటీ హాల్ లో ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం పీఎన్‌జీ వంట గ్యాస్ సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ నగర్‌లో 360 డబుల్ బెడ్రూం ఇండ్లు గృహ ప్రవేశాలు చేయించడం, పీఎన్‌జీ వంట గ్యాస్ సరఫరా ప్రారంభోత్సవం, బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పేద ప్రజలు కొత్త వస్త్రాలు ధరించి బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆడబిడ్డలకు చీరలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. నాణ్యమైన, చూడ చక్కని 110 రకాల రంగు రంగుల చీరలను ఆడపడుచులకు పంపిణీ చేస్తున్నాం అని పేర్కొన్నారు. జిల్లాలో ఆహార భద్రత కార్డు కలిగిన 3 లక్షల 83 వేల మందికి చీరలను పంపిణీ చేయనున్నాం అని స్పష్టం చేశారు.

# స్వచ్ఛ్ భారత్ మిశన్-అర్బన్ 2.0ను, అమృత్ 2.0 ను ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న ఇక్కడ స్వచ్ఛ్ భారత్ మిశన్-అర్బన్ 2.0 ను, అటల్ మిశన్ ఫర్ రిజూవినేశన్ ఎండ్ అర్బన్ ట్రేన్స్‌ఫర్ మేశన్ 2.0 (ఎఎమ్ఆర్ యుటి.. 'అమృత్') ను ప్రారంభించారు. ఈ సందర్భం లో కేంద్ర మంత్రులు శ్రీ హర్ దీప్ సింహ్ పురీ, శ్రీ గజేంద్ర సింహ్ శెఖావత్, శ్రీ ప్రహ్లాద్ సింహ్ పటేల్, శ్రీ కౌశల్ కిశోర్, శ్రీ శ్రీ బిశ్వేశ్వర్ టుడూ, రాష్ట్రాల మంత్రులు, మేయర్ లు, పట్టణ, స్థానిక సంస్థ ల చైర్ పర్సన్ లు, మ్యూనిసిపల్ కమిశనర్ లు పాలుపంచుకొన్నారు.

ఈ సందర్భం గా ప్రధాన మంత్రి మాట్లాడుతూ, 2014వ సంవత్సరం లో దేశ ప్రజలు భారతదేశాన్ని బహిరంగ ప్రదేశాల లో మల మూత్రాదుల విసర్జన కు తావు లేనటువంటిది (ఒడిఎఫ్) గా ఆవిష్కరించడం కోసం ప్రతిన పూనారు, మరి వారు 10 కోట్ల కు పైగా టాయిలెట్ ల నిర్మాణం ద్వారా ఈ ప్రతిజ్ఞ ను నెరవేర్చారు అని పేర్కొన్నారు. ఇక 'స్వచ్ఛ్ భారత్ మిశన్-అర్బన్-2.0' లక్ష్యమల్లా నగరాల ను చెత్త కు ఎంతమాత్రం తావు ఉండనటువంటివి గా తీర్చిదిద్దడమే అని ఆయన చెప్పారు. 'సీవేజీ మరియు సెప్టిక్ మేనేజ్ మెంట్ లో సంస్కరణ, మన నగరాల ను జల సురక్షత కలిగినవి గా తీర్చిదిద్దడం తో పాటు మన నదుల లో ఎక్కడా కూడాను మురుగు కాలువలు కలవకుండా చూడటం' అనేవి మిశన్ అమృత్ తదుపరి దశ లో దేశం నిర్దేశించుకొన్న లక్ష్యాలుగా ఉన్నాయి అని ప్రధాన మంత్రి వివరించారు.

పట్టణ ప్రాంతాల ఉత్థానం, స్వచ్ఛత తో ముడిపడ్డ మార్పు తాలూకు సాఫల్యాల ను మహాత్మ గాంధీ కి ప్రధాన మంత్రి అంకితం చేశారు. ఈ మిశన్ లన్నీ మహాత్మ గాంధీ ఇచ్చిన ప్రేరణ వల్ల ఒనగూరిన ఫలితాలు, మరి ఆయన ఆదర్శాల ను అనుసరించడం ద్వారానే అవి కార్యరూపం దాల్చుతున్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. టాయిలెట్ ల నిర్మాణం తో మాతృమూర్తుల, కుమార్తెల జీవనం మెరుగుపడిందని ఆయన ప్రముఖం గా ప్రస్తావించారు.

దేశ ప్రజల ఉత్సాహాని కి ప్రధాన మంత్రి వందనాన్ని ఆచరిస్తూ, ఇంతవరకు సాగిన స్వచ్ఛ్ భారత్ అభియాన్ మరియు అమృత్ మిశన్ ల ప్రస్థానం దేశం లో ప్రతి ఒక్కరు గర్వపడే విధం గా ఉంది అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. "దీనిలో ఒక మిశన్ అంటూ ఉంది, దీనిలో గౌరవం, మర్యాద ఉన్నాయి. దీనిలో ఒక దేశం ఆకాంక్ష కూడా ఇమిడి ఉంది. అంతేకాదు, మాతృభూమి పట్ల సాటి లేనంతటి ప్రేమ కూడా ఉంది." అని ఆయన చెప్తూ, ప్రజల మనోభావాల కు వాగ్రూపాన్ని ఇచ్చారు.

ఈ రోజు చేపట్టిన కార్యక్రమం ఆమ్బేడ్ కర్ ఇంటర్ నేశనల్ సెంటర్ లో జరుగుతున్నదని ప్రధాన మంత్రి పేర్కొంటూ, పట్టణ ప్రాంతాల అభివృద్ధి అనేది అసమానతల ను తొలగించడానికి ఒక గొప్ప సాధనం అని బాబా సాహెబ్ నమ్మారు అని చెప్పారు. గ్రామాల లో ఉండే ప్రజలు అనేక మంది మెరుగైనటువంటి జీవనాన్ని ఆకాంక్షిస్తూ నగరాల కు విచ్చేస్తారని ఆయన అన్నారు. వారు ఉపాధి దొరుకుతుంది కానీ వారి జీవన స్థాయి పల్లెల లో కంటే మరింత కష్టమైంది గా ఉంటోందన్న సంగతి ని మనం ఎరుగుదుము అని ఆయన అన్నారు. ఇది వారిని రెండిందాలు గా దెబ్బ తీసేది గా ఉంటుంది, ఒకటేమో వారు స్వస్థలానికి దూరం గా బతకవలసి రావడం, మీదు మిక్కిలి గా ఇటువంటి స్థితిలో ఉండడం అని ఆయన అన్నారు. ఈ స్థితిగతులను మార్చడం పైన, ఈ అసమానత్వాన్ని దూరం చేయఃడం పైన శ్రద్ధ తీసుకోవాలని బాబా సాహెబ్ నొక్కి చెప్పారు అని ప్రధాన మంత్రి అన్నారు. స్వచ్ఛ్ భారత్ మిశన్, మిశన్ అమృత్ తదుపరి దశ లు బాబా సాహెబ్ కన్న కలల ను పండించే దిశ లో ఒక ముఖ్యమైన అడుగు అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు.

స్వచ్ఛత తాలూకు ప్రచార ఉద్యమం ఆశించిన ఫలితాల ను ఇవ్వాలి అంటే గనక 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ లతో పాటు సబ్ కా ప్రయాస్' కూడా కీలకం అని ప్రధాన మంత్రి అన్నారు. దీనికి తోడు స్వచ్ఛత కు సంబంధించినంత వరకు ప్రజల ప్రాతినిధ్యం స్థాయి ని గురించి ప్రధాన మంత్రి చెప్తూ, ప్రస్తుత తరం స్వచ్ఛత ప్రచార ఉద్యమాన్ని బలపరచే బాధ్యత ను తీసుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. టాఫీ రేపర్ లను పిల్లలు ఇప్పుడు నేల మీద పారేసేవేయకుండా వారి జేబు లో పెట్టుకొంటున్నారు. వారు తగని పని చేయకండంటూ పెద్దల కు బుద్ధులు చెప్తున్నారు కూడా అని ఆయన అన్నారు. "స్వచ్ఛత అనేది ఏ ఒక్క రోజు కో, ఒక పక్షం రోజులకో, ఒక సంవత్సరానికో, లేదా కొద్ది మందే చేయవలసిందో కాదు అనే విషయాన్ని మనం జ్ఞాపకం పెట్టుకోవాలి. స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి ప్రచార ఉద్యమం, ప్రతి రోజూ, ప్రతి పక్షం రోజుల పాటు, ప్రతి సంవత్సరం పొడవునా, తరం తరువాత తరం వారీ గా అనుసరించవలసినటువంటి మహా ప్రచార ఉద్యమం. స్వచ్ఛత ఒక జీవనశైలి. స్వచ్ఛత అనేది జీవన మంత్రం గా ఉంది" అని ప్రధాన మంత్రి అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి గా తాను ఆ రాష్ట్రం లో పర్యటన అవకాశాల ను పెంపొందింప చేయడం కోసం చేసిన కృషి ని ప్రధాన మంత్రి గుర్తు కు తెచ్చుకొంటూ, స్వచ్ఛత కోసం సాగిన అన్వేషణ ను నిర్మల్ గుజరాత్ కార్యక్రమం ద్వారా ఒక ప్రజా ఉద్యమం గా మార్చివేసినట్లు తెలియ జేశారు.

స్వచ్ఛత తాలూకు ప్రచార ఉద్యమాన్ని తదుపరి స్థాయి కి తీసుకు పోవడం కోసం తీసుకున్న చర్యల ను ప్రధాన మంత్రి ఒక్కటొక్కటిగా వివరిస్తూ, భారతదేశం ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు గా ఒక లక్ష టన్నుల వ్యర్థాల ను శుద్ధి చేస్తోందని, '2014వ సంవత్సరం లో దేశం ఈ ప్రచార ఉద్యమాన్ని మొదలుపెట్టినప్పుడు నిత్యం పోగయ్యే వ్యర్థాల లో 20 శాతం కన్నా తక్కువ వ్యర్థ పదార్థాల ను శుద్ధిపరచడం జరిగింది. ప్రస్తుతం రోజువారీ వ్యర్థ పదార్థాల లో దాదాపుగా 70 శాతం వ్యర్థాల ను శుద్ధి పరచడం జరుగుతోంది. మరి దీనిని 100 శాతానికి చేర్చవలసి ఉంది' అని ఆయన తెలిపారు. పట్టణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ కు కేటాయింపుల ను పెంచడాన్ని గురించి కూడా ప్రధాన మంత్రి వివరించారు. 2014వ సంవత్సరానికి పూర్వం 7 సంవత్సరాల కాలం లో ఆ మంత్రిత్వ శాఖ కు సుమారుగా 1.25 లక్షల కోట్ల రూపాయలను ఇవ్వడం జరుగగా, 2014వ సంవత్సరం తరువాత ఏడేళ్ళ లో సదరు మంత్రిత్వ శాఖ కు దాదాపుగా 4 లక్షల కోట్ల రూపాయలను కేటాయించడమైంది అని ఆయన వెల్లడించారు.

దేశం లో నగరాల అభివృద్ధి కి గాను ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించడం అనేది కూడా ఎప్పటికప్పుడు వృద్ధి చెందుతోంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ సందర్భం లో ప్రధాన మంత్రి ఇటీవలే ప్రవేశపెట్టిన నేశనల్ ఆటోమొబైల్ స్క్రాపేజ్ పాలిసి ని గురించి ప్రస్తావించి, ఈ కొత్త విధానం 'వ్యర్థం నుంచి సంపద' అనే ప్రచార ఉద్యమాన్ని, ఒక సర్క్యులర్ ఇకానమి ని పటిష్ట పరుస్తుందని పేర్కొన్నారు.

వీధి వీధి కీ తిరుగుతూ సరుకుల ను అమ్మే వ్యాపారులు పట్టణాభివృద్ధి కి సంబంధించిన కార్యక్రమాల అమలు లో అత్యంత ముఖ్య భాగస్వాముల లో ఒకరు అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ వీధి విక్రేతల కు 'పిఎం స్వనిధి యోజన' ఒక కొత్త ఆశాకిరణం గా మారింది అని ఆయన అన్నారు. స్వనిధి పథకం లో భాగం గా ఎంతో మంది వీధి విక్రేత లు ప్రయోజనాల ను అందుకొన్నారని, 25 లక్షల మంది కి 2,500 కోట్ల రూపాయల సొమ్ము అందిందని ఆయన తెలిపారు. ఈ వ్యాపారులు డిజిటల్ ట్రాన్సాక్శన్స్ ను పెంచుతున్నారు, వీరు తాము తీసుకొన్న రుణాల ను తిరిగి చెల్లించడం లో చాలా చక్కని రికార్డు ను నమోదు చేస్తున్నారు అని ప్రధాన మంత్రి అన్నారు. ఉత్తర్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలుపరచడం లో అగ్రభాగాన నిలుస్తున్నాయి అని చెప్తూ ఈ పరిణామం పట్ల ఆయన తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# మంత్రి వేముల సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన పలు పార్టీల నాయకులు



హైదరాబాద్ , అక్టోబర్ 2: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, జనరంజక పాలన, అభివృద్ధి తమకు ఎంతగానో నచ్చాయని చెపూ పలు పార్టీలకు చెందిన నేతలు గులాబి కండువా కప్పుకున్నారు.

బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్ మండలం రామన్నపేట గ్రామంలో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీలకు చెందిన 25 మంది నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా హైదరాబాద్ చేరుకొని, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు.

వీరందరికీ గులాబీ కండువా కప్పిన మంత్రి వేముల పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని ఈ సందర్భంగా మంత్రి వేముల వ్యాఖ్యానించారు. పార్టీలో చేరిన వారిలో రామన్నపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు శోభన్ రెడ్డి, బీఎస్పీ నేత భూమా రెడ్డితోపాటు తిరుపతి, నరేష్, లింబద్రి, రణవీర్, గంగాధర్, గంగమల్లు, గోపి, మగ్గి అశోక్, తిరు మహిపాల్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాగధర్, రాములు, మోహన్ రెడ్డి, పురుషోత్తం సర్పంచ్ శోభన్, నరేందర్, జువ్వాజి వేణు, పందేన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సైక్లికల్ వెలాసిటీను సాధించడానికి అవసరమైన కార్యాచరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:స్టీల్ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎండిసి) నిన్న తన 63 వ ఏజీఎంని నిర్వహించింది. క్లిష్ట సమయంలో సాధించిన అద్భుతమైన పనితీరుకు సంబంధించిన ముఖ్యాంశాలను ఈ సందర్భంగా సంస్థ పంచుకుంది.

ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ సుమిత్ దేబ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ కరోనా మహమ్మారి ఉక్కు డిమాండ్‌లో మార్పు తెచ్చే కొన్ని కీలక ధోరణులను వేగవంతం చేసిందని చెప్పారు. " ఇనుము మరియు ఉక్కు పరిశ్రమ డిజిటలైజేషన్ మరియు ఆటోమేషన్, మౌలిక సదుపాయాల చొరవ, పట్టణ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ మరియు ఇంధన పరివర్తన ద్వారా వేగవంతమైన అభివృద్ధి నుండి అద్భుతమైన అవకాశాలను చూస్తుంది. ఎన్ఎండిసి ఇనుప ఖనిజం మరియు ఉక్కు రంగంలో చక్రీయ అస్థిరతలను గ్రహించి, వృద్ధి పథంలో ముందుకు సాగడానికి అవసరమైన కార్యాచరణ మాకు ఉంది" అని తెలిపారు.

ఎఫ్.వై 21 సమయంలో ఎన్ఎండిసి బృందం నెలకొల్పిన అనేక రికార్డులను కూడా శ్రీ దేబ్ పంచుకున్నారు. ఇందులో రూ. 15,370 కోట్లు రికార్డు టర్నోవర్ కూడా ఉంది. కంపెనీ ప్రారంభం నుండి ఇదే అత్యధికం.

భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజం మైనర్‌గా ఎన్ఎండిసి దేశీయ డిమాండ్‌లో ఊహించని పెరుగుదలను తీర్చడానికి సిద్ధంగా ఉంది. మరియు త్వరగా కోలుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన చురుకైన చర్యల ద్వారా మరింత మద్దతునిచ్చింది. ఈ మహమ్మారి యొక్క కఠినమైన రెండవ వేవ్ ఇబ్బందుల్లో కూడా ఎన్ఎండిసి బృందం రికార్డు ఉత్పత్తి మరియు అమ్మకాలను కూడా సాధించిందని శ్రీ దేబ్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎండిసి అత్యధికంగా 34.15 ఎంటి ఉత్పత్తిని మరియు 33.25 ఎంటి అమ్మకాలను సాధించింది.

సంస్థ యొక్క డిజిటల్ పరివర్తనపై కూడా శ్రీ దేబ్ నొక్కిచెప్పారు. ఎన్ఎండిసివద్ద డిజిటల్ పరివర్తనలో ఒక ఫ్లీట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఆటోమేటిక్ శాంప్లింగ్, దృష్టిని పెంచే వ్యవస్థలు పొగమంచు వాతావరణంలో ప్రమాదాలను నివారించడానికి మరియు 3 డి వాల్యూమెట్రిక్ లేజర్ స్కానర్‌లు, ఉత్పాదకతను మెరుగుపరచడం మరియు కార్యాచరణ భద్రతను పెంచడం వంటివి ఉంటాయి.

# గాంధీజీ జీవిత విశేషాలపై ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు, సిద్దంతాలు అందరూ ఆచరించాల్సిన ఆవశ్యకత నేడు ఎంతైనా ఉందని తెలంగాణ శాసన మండలి సభ్యురాలు, ప్రముఖ విద్యావేత్త శ్రీమతి సురభి వాణి దేవి అన్నారు. గాంధీజీ అనుసరించిన, అభిలషించిన సత్యం, అహింస, స్వచ్ఛత, మహిళల అభ్యున్నతి, గ్రామాల్లో స్వయం పాలన లాంటి సిద్ధాంతాలను నేటి తరం తెలుసుకొని ఆచరించాలని ఆమె అన్నారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవాల' లో భాగంగా, మహాత్మా గాంధీ 152 వ జయంతి సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార శాఖకు చెందిన రీజనల్ ఔట్ రీచ్ బ్యూరో (ఆర్ఒబి) మహాత్మా గాంధీ జీవిత విశేషాల పై శిల్పారామం లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫోటో ఎగ్జిబిషన్ ను గురువారం నాడు ఎమ్.ఎల్.సి శ్రీమతి సురభి వాణీ దేవి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ అహింసాయత మార్గం లో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని అన్నారు. నేటి తరానికి ఆ మహనీయుని జీవితం ,ఆయన పాటించిన ఆదర్శాల గురించి తెలియ చేసేందుకు ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేసిన ఆర్. ఓ. బి ని ఆమె అభినందించారు.

ఈ సందర్భంగా పిఐబి, ఆర్ఒబి డైరక్టర్ శ్రీమతి శృతి పాటిల్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ 152వ జయంతిని పురస్కరించుకొని 'ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో' భాగంగా కేంద్ర ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన క్షేత్రస్థాయి విభాగాలు పలు కార్యక్రమాలు, ఛాయాచిత్ర ప్రదర్శనలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శనలో గాంధీ మహాత్మునికి సంబంధించిన స్వాతంత్ర్య పోరాటంలోని వివిధ కీలక అంశాలను ఏర్పాటుచేశారు అంతకు ముందు క్లీన్ ఇండియా కార్యక్రమం పై నెహ్రూ యువ కేంద్రం రూపొందించిన పోస్టర్ ను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. ప్రచురణల విభాగం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్య ఆర్. ఓ.బి ,పి. ఐ.బి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గాంధీజీ జీవితం ప్రధాన ఇతివృత్తంగా మహాత్మునికి ఎంతో ఇష్టమైన 'వైష్ణవ జనతో' ప్రార్థనా గీతం నేపథ్యంగా రీజనల్ ఔట్ రీచ్ బ్యూరో గేయ నాటక విభాగం కళాకారులు ప్రదర్శించిన "గాంధీ మార్గం" నాటిక సభికులను అమితంగా ఆకట్టుకుంది. గాంధీజీ విశ్వసించిన, ఆచరించిన సిద్ధాంతాలను సంక్షిప్తంగా, అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను పొందారు.

# మంజీరా నదిలో యదేచ్ఛగా ఇసుక మాఫియా: వైఎస్ షర్మిల

నిజామాబాద్, అక్టోబర్ 2:నిజామాబాద్ జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని మంజీరా నదిలో యథేచ్ఛగా ఇసుక మాఫియా సాగుతోందని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. సామాన్య జనం ఇసుక రవాణాను అడ్డుకుంటే వారిపై పీడీ యాక్టు, రౌడీ షీట్ ఓపెన్ చేసి జైళ్లలో పెడుతున్నారని మండిపడ్డారు. బంగారు తెలంగాణను దోపిడీ, దొంగల తెలంగాణగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. దళితుల ప్రాణాలంటే కేసీఆర్‌కు లెక్కలేదన్నారు. ఇసుక మాఫియాపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇసుక దందా వెనక ఎవరెవరు ఉన్నారు? ఎవరికి ఎంత వాటా వెళ్తుంది? దోషులెవరో తేల్చాలని షర్మిల డిమాండ్ చేశారు.

# పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రాజీవ్ బన్సాల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి వప్రదీప్ సింగ్ ఖరోలా ఐఎఎస్ (కెఎన్ః85) పదవీకాలం 30 సెప్టెంబర్ 2021న పూర్తి కావడంతో ఆయన స్థానంలో రాజీవ్ బన్సాల్ ఐఎఎస్ (ఎన్ఎల్88) బాధ్యతలను స్వీకరించారు.

ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల అధికారి అయిన బన్సాల్ 1988 బ్యాచ్ కు చెందిన నాగాలాండ్ కేడర్ అధికారి. కేంద్ర ప్రభుత్వంలో ఆయన పౌర విమానయాన శాఖ పరిధిలోని ఎయిర్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, పెట్రోలియం ఒ సహజవాయువు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సంయుక్త కార్యదర్శిగా, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సిఇఆర్‌సి) కార్యదర్శిగా, భారీ పరిశ్రమలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని భారీ పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి సహా వివిధ కీలక పదవీ బాధ్యతలను నిర్వహించారు. నాగాలాండ్ ప్రభుత్వంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఒ కార్యదర్శిగా, పాఠశాల విద్య శాఖ కమిషనర్ ఒ కార్యదర్శిగా, ఆర్థిక శాఖ కమిషనర్ ఒ కార్యదర్శి వంటి కీలక బాధ్యతలను నిర్వహించారు.

# క్లీన్ ఆంధ్రప్రదేశ్ -జగనన్న స్వచ్ఛ సంకల్పం.. ప్రారంభించిన సీఎం



అమరావతి, , అక్టోబర్ 1:ఏపీలోని గ్రామీణ, పట్టణ, నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా 'క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)?జగనన్న స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించారు. విజయవాడ బెంజ్ సర్కిల్ వేదికగా సీఎం ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. స్వచ్ఛ సంకల్పం, క్లాప్ పథకాల అమలులో భాగంగా 4,097 చెత్త సేకరణ వాహనాలను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. గార్బేజ్ టిప్పర్ వాహనం, హై ప్రెజర్ క్లీనర్లను సీఎం జగన్? పరిశీలించారు. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు సీఎం నివాళులు అర్పించారు. 100 రోజులపాటు జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కొనసాగనుంది.

మెరుగైన పారిశుధ్య నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్తలతో పాటు ప్రమాదకరమైన వ్యర్థాల సేకరణ కోసం ఇంటింటికి 3 డస్ట్ బిన్‌ల చొప్పున పంపిణీ చేయనున్నారు. 123 కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీల్లోని 40 లక్షల గృహాలకు 1.20 కోట్ల డస్ట్ బిన్‌లు పంపిణీ చేస్తారు. ఇందుకు రూ.100 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చిస్తోంది.

చెత్త సేకరణ కోసం 5,868 జీపీఎస్ ఆధారిత గార్బేజ్ టిప్పర్ల ద్వారా గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు తరలించేలా ఏర్పాట్లు చేశారు. మెరుగ్గా చెత్త సేకరణ, తరలింపు కోసం 3,097 ఆటో టిప్పర్లు, 1,771 ఎలక్ట్రిక్ ఆటోలను పంపిణీ చేయనున్నారు. 231 గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల నుంచి తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరు వాహనాల ద్వారా ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్‌ల వద్దకు చేర్చనున్నారు. తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువు, బయోగ్యాస్ తయారీతో పాటు పొడి చెత్త నుంచి హానికారక వ్యర్థాలను వేరు చేసి పునర్వినియోగానికి అనుకూలంగా వస్తువులను మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు 10,731 హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్‌ల కొనుగోలు చేశారు. జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలలో 1,500 పబ్లిక్ టాయిలెట్లు నిర్మించనున్నారు.

# కొచ్చిన్ పోర్టులో నిర్వహించిన 'స్వచ్ఛత పఖ్వాడా' కార్యక్రమం ముగింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:కొచ్చిన్ పోర్టులో 16/09/2021వ తేదీ నుండి 30/09/2021 వరకు నిర్వహించిన స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఉద్యోగులు తమ పని ప్రాంతంలోను, కార్యాలయ ప్రాంగణంలోను, పడవలు/టగ్‌లు మరియు పోర్ట్ ప్రాంతంలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమంల సందర్భంగా పోర్ట్ ప్రాంతం మరియు విల్లింగ్‌డన్ ద్వీపంలో గల రెండు మునిసిపల్ కార్పొరేషన్ వార్డులలో సాధారణ పరిశుభ్రత కార్యక్రమాల్ని చేపట్టే ఉద్యోగులకు పరిశుభ్రత కిట్‌లను పంపిణీ చేశారు. కొచ్చిన్ పోర్ట్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం. బీనా దీనిని ప్రారంభించారు.

కొచ్చిన్ పోర్ట్ ట్రస్ట్ యొక్క అన్ని విభాగాల ఎంపికైన ఉద్యోగులకు వారి ఇంటి వద్ద కూరగాయల తోటలను అభివృద్ధి చేయడం కోసం కూరగాయల విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రీన్ ఎనర్జీ వినియోగానికి తగిన ప్రాచుర్యం చేకూర్చే చొరవలో భాగంగాకొచ్చిన్ పోర్ట్ ట్రస్ట్ ద్వారా ఎంబార్కేషన్ జెట్టీ (నార్త్‌హండ్ పబ్లిక్ ఫెర్రీ జెట్టీ, విల్లింగ్‌డన్ ఐలాండ్) వద్ద ఏర్పాటు చేసిన పలు సోలార్ విద్యుత్ దీపాలను చైర్‌పర్సన్ ఈ సందర్భంగా ప్రారంభించారు. స్వచ్ఛత సందేశాన్ని వ్యాప్తి చేయడానికి 28/09/2021వ తేదీన సైకిల్ ర్యాలీ చేపట్టారు. కొచ్చిన్ పోర్ట్ ట్రస్ట్ క్రీడాకారులు మరియు కొచ్చిన్ పోర్ట్ ట్రస్ట్ యొక్క సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. పరిశుభ్రమైన పర్యావరణ ప్రాముఖ్యత మరియు మెరైన్ డిపార్ట్‌మెంట్ ద్వారా నీటి వనరులను శుభ్రంగా ఉంచడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించందుకు కొచ్చిన్ పోర్ట్ ట్రస్ట్ ఉద్యోగులకు పలు తరగతులు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భఃగా పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను తెలియజేసేలా బ్యానర్లు, స్టిక్కర్లను రో-రో వెస్సల్స్ , పడవలు మరియు పోర్ట్ ప్రాంతంలోని ముఖ్యమైన ప్రదేశాలలో ఏర్పాటు చేశారు. పఖ్వాడా కాలంలో కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు 'స్వచ్ఛత' థీమ్‌పై షార్ట్ ఫిల్మ్ పోటీ మరియు పోస్టర్ డిజైనింగ్ పోటీలు నిర్వహించబడ్డాయి. పఖ్వాడా కాలంలో ఎర్నాకుళంలోని వార్ఫ్ కార్యాలయంలో గల వార్ఫ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద దివ్యాంగ్ యాక్సెస్ సౌకర్యం నిర్మించబడింది. కొచ్చిన్ పోర్ట్ ట్రస్ట్ యొక్క ప్రతి విభాగంలో ఉత్తమంగా నిర్వహించబడుతున్న కార్యాలయాలు పఖ్వాడా కాలంలో గుర్తించబడ్డాయి మరియు వాటికి తగిన విధంగా అవార్డులను ప్రదానం చేయడమైంది. విల్లింగ్‌డన్ ద్వీపంలోని వివిధ ప్రదేశాల నుండి పదిహేను ట్రక్ లోడ్‌ల మేర వ్యర్థాలు/ చెత్తను తొలగించి, నిర్దేశించిన ప్రదేశంలో డంప్ చేశారు. కోవిడ్ మహమ్మారి పరిస్థితి నేపథ్యంలో సామాజిక దూరం మరియు ఇతర భద్రతా చర్యలకు అనుగుణంగా ఆయా కార్యక్రమాలను నిర్వహించారు.

# బతుకమ్మ చీరలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

వరంగల్,అక్టోబర్ 2:: పరకాల నియోజకవర్గ పరిధిలోని గీసుకొండ మండలం కొమ్ముల గ్రామంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా అర్హులైన మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రతి ఏడాది ఆడపడుచులకు సీఎం కేసీఆర్ చీరలను బహుకరిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ఒక లక్షా 10 వేల మంది మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సంరక్షణ కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో పల్లెలు ఎంతో అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు.



# 5వ తూర్పు ఆసియా దేశాల విద్యా మంత్రుల సమావేశంలో ప్రసంగించిన కేంద్ర విద్యా శాఖ మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:'21 వ శతాబ్దపు ఆకాంక్షలను నెరవేర్చడానికి భారతదేశం ప్రపంచ సామర్థ్యాలను నిర్మిస్తోంది 'అని కేంద్ర విద్య మరియు నైపుణ్య అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. 5వ తూర్పు ఆసియా దేశాల(ఈఏఎస్) విద్యా శాఖ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యా శాఖ సహాయ మంత్రి శ్రీ రాజ్‌కుమార్ రంజన్ సింగ్, మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి శ్రీ ప్రధాన్.. మనీలా కార్యాచరణ ప్రణాళికలో పేర్కొన్న పరిపూరకాలతో సమకాలీకరించడంలో దీర్ఘకాలికమైన, పరస్పర ప్రయోజనకరమైన విద్యా సహకారాన్ని పెంపొందించడంలో భారతదేశం నిబద్ధతను పునరుద్ఘాటించారు. భారత విద్యావిధనం యొక్క లక్ష్యాలను మంత్రి ఈ సందర్భంగా వివరించారు. విద్య యొక్క సార్వత్రికీకరణ, సమానత్వం, నాణ్యత, స్థోమత మరియు వశ్యత, సాంకేతికత ఆధారిత అభ్యాసనం మరియు విద్యపై మనీలా కార్యాచరణ ప్రణాళిక సూత్రాలను పాటించే అనేక ఇతర అంశాలతో సహా భారత జాతీయ విద్యా విధానం యొక్క లక్ష్యాలను ఈ సందర్భంగా మంత్రి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రధాన్ మల్టీ-మోడల్ డిజిటల్ అంశాలను గురించి వివరించారు. మహమ్మారి విస్తరించి ఉన్న సమయంలోనూ ప్రభుత్వం చేపట్టిన పీఎం-ఈవిద్యా, స్వయం, దీక్ష, మొదలైనవి విద్యార్థులు నేర్చుకునే ప్రక్రియను నిర్ధారించేలా దోహదం చేశాయని అన్నారు. డిమాండ్ మేరకు నేర్చుకోవడాన్ని సులభతరం చేయడానికి, డిజిటల్ తారతమ్యతను రూపుమాపేలా ఒక వంతెనెలా పని చేయడానికి తాము ఏర్పాటు చేసిన డిజిటల్ మౌలిక వసతులు పెంచడం ఇవి ఎంతగానో దోహదం చేసినట్టుగా మంత్రి తెలిపారు. దేశ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృష్టి కోణం అనుగుణంగా, విద్య మరియు నైపుణ్యాలను మరింత కలుపుకొని, సరసమైన, సమానమైన, శక్తివంతమైన మరియు ఆకాంక్షను కలిగించడానికి గాను అర్థవంతమైన భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవడానికి భారతదేశం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. విద్యార్థుల ఆకాంక్షలను నెరవేర్చడానికి విద్యార్థి మరియు విద్యాసంబంధ



మార్పిడిని ప్రోత్సహించడం, టీవీఈటీతో సహా పరిశోధన మరియు విద్యా సహకారాన్ని బలోపేతం చేయడానికి భారతదేశం యొక్క మద్దతును మంత్రి శ్రీ ప్రధాన్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# ప్రజా రవాణా, లాజిస్టిక్స్‌ను 100 శాతం హరిత, స్వచ్ఛ ఇంధన వనరులకు మార్చడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది: శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:ప్రజా రవాణా, లాజిస్టిక్స్‌ను 100 శాతం హరిత, స్వచ్ఛ ఇంధన వనరులకు మార్చడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ' మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ వెల్లడించారు. "ఇంటర్నేషనల్ ఆటోమోటివ్ టెక్నాలజీ" సమావేశంలో వర్చువల్ పద్ధతిలో పాల్గొన్న శ్రీ గడ్కరీ; రవాణా రంగం ప్రయోజనం కోసం హైడ్రోజన్ సాంకేతికతలను అభివృద్ధి చేసే లక్ష్యంతో, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ జాతీయ హైడ్రోజన్ కార్యక్రమాన్ని ప్రారం భించారని తెలిపారు. హరిత హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగంలో భారత్‌ను అగ్రగామిగా నిలపాలన్నది కూడా ఈ కార్యక్రమం ఉద్దేశంగా చెప్పారు. హరిత హైడ్రోజన్ ఉత్పత్తి వ్యయంలో 70% విద్యుత్ ధరల నుంచి తిరిగి వస్తుంది. కాబట్టి, పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి మిగులే విద్యుత్, హరిత హైడ్రోజన్ ఉత్పత్తి ఆర్థికతను పూర్తిగా మార్చగలదు. హరిత హైడ్రోజన్‌ను భవిష్యత్ ఇంధనంగా చెబుతారు. "సున్నా కార్బన్ ఉద్గారాల" లక్ష్యాన్ని సాధించడానికి సహాయపడే ఏకైక ఇంధనంగా గడ్కరీ పేర్కొన్నారు.భారతదేశ 75 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలు ప్రారంభమైనందున ఈ ఏడాది ప్రత్యేకమైనదిగా శ్రీ గడ్కరీ అభివర్ణించారు. అన్ని రంగాలలో ఆత్మనిర్భర్‌గా అవతరించడానికి ప్రధాని నేతృత్వంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మన ఆటోమొబైల్ రంగం దేశానికే గర్వకారణమని, ఇది భారతదేశ ఉత్పత్తిని కొత్త శిఖరాలకు తీసుకువెళ్తుందని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సరితూగడమే కాదు, అంతకంటే మెరుగైన స్థితికి తీసుకువెళుతుందనే నమ్మకం ఉందని కేంద్ర మంత్రి అన్నారు.

దేశ వాహన పరిశ్రమలో 'ఆధునిక వాహన సాంకేతిక ఉత్పత్తుల'ను పెంచడం లక్ష్యంగా 'ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకం' (పీఎల్ఐ) పథకాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి చెప్పారు. శిలాజ ఇంధన ఉద్గారాలను తగ్గించడంలోనూ ఇది సహాయపడుతుందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా రూ.42,500 కోట్లకు మించిన కొత్త పెట్టుబడులు, 7.5 లక్షల అదనపు ఉద్యోగాలు వస్తాయని

ప్రభుత్వం భావిస్తోందని శ్రీ గడ్కరీ చెప్పారు.

దిగుమతి చేసుకుంటున్న ఇంధనానికి ప్రత్యామ్నాయం, తక్కువ ఖర్చుతో కూడినది, కాలుష్యం లేనిది, దేశీయం రవాణా అవసరాలను తీర్చగలిగే పరిష్కారం ప్రజా రవాణాకు అత్యవసరమని; ముడిచమురుపై ఆధారపడటాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఇథనాల్, పెట్రోల్ రెండింటితోనూ నడిచే వాహనాలను అనుమతించే 'సౌలభ్య-ఇంధన' వాహనాలను కూడా ప్రవేశపెట్టాలని యోచిస్తున్నామని శ్రీ గడ్కరీ చెప్పారు. సౌలభ్య ఇంజిన్ ఆధారిత వాహనాలు ఇప్పటికే అమెరికా, బ్రెజిల్, కెనడాలో నడుస్తున్నాయని తెలిపారు. ఆ సాంకేతికత అందుబాటులోనే ఉందని, భారతదేశంలోని రవాణా రంగాన్ని శాశ్వతంగా మార్చే అడుగు వేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

ప్రజా భద్రత దృష్ట్యా, ప్రతి సంవత్సరం మాదిరిగానే రహదారుల్లో మెరుగుదల అవసరమని మంత్రి చెప్పారు. దాదాపు 5 లక్షల రోడ్డు ప్రమాదాల్లో 1.5 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. ఐరోపా దేశాల్లో సున్నా ప్రమాదాలు, సున్నా ప్రాణనష్టం సాధించిన 'జీరో విజన్'ను మన దేశంలోనూ అనుసరిస్తున్నామని శ్రీ గడ్కరీ వివరించారు.

# ఎన్నికలు, ప్రజాస్వామ్యం అనే అంశంపై తొలిసారిగా జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ( ఐఐఐడిఇఎం ), జిందాల్ గ్లోబల్ లా స్కూల్ (జేజీఎల్ఎస్) సహకారంతో కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ స్థాయిలో తొలిసారిగా 'ఎన్నికలు, ప్రజాస్వామ్యం' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తోంది. ఈ పోటీలకు ఎంట్రీలను 2021 అక్టోబర్ రెండవ తేదీ నుంచి నవంబర్ 21వ వరకు స్వీకరిస్తారు. రెండు అంశాలపై ఈ వ్యాస రచన పోటీలు జరుగుతాయి. 1. ఎన్నికల సమయంలో సోషల్ మీడియా నియంత్రణకు చట్టబద్ధ వ్యవస్థ 2. ఎన్నిక ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికల సంఘం పాత్ర అనే అంశాలపై పోటీలు జరుగుతాయి. దేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అమలులో ఉన్న చట్టాలపై న్యాయ విద్యార్థులు పరిశోధన చేపట్టే అంశాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతోంది. ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తారు. ఇంగ్లీష్, హిందీ భాషల్లో పోటీలు జరుగుతాయి. బార్ కౌన్సిల్ అఫ్ ఇండియా గుర్తింపు పొందిన భారత న్యాయ విశ్వవిద్యాలయం/సంస్థ/కళాశాలలో న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గోవచ్చు. హర్యానాలోని సోనిపట్ కేంద్రంగా పనిచేస్తున్న జిందాల్ గ్లోబల్ లా స్కూల్ కి చెందిన ఎన్నికల చట్టాలపై పట్టు కలిగిన అధ్యాపకులు ఐఐఐడిఇఎం సహకారంతో ఎంట్రీలను మదింపు వేస్తారు. నవీన కల్పనా శక్తి, ఈ విధంగా రాశారు, పరిశోధనా నాణ్యత, వాదన, గత తీర్పుల ప్రస్తావన అంశాలపై ఈ మదింపు జరుగుతుంది. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తారు. మొదటి బహుమతిగా లక్ష రూపాయలను అందిస్తారు.

ఎన్నికల నిర్వహణకు సంబంధించి దేశంలో అమలులో ఉన్న చట్టాలపై పరిశోధన సాగేలా యువతను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామని ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ సుశీల్ చంద్ర తెలిపారు. న్యాయ విద్యను అభ్యసిస్తున్న యువత ఎన్నికల చట్టాలపై పరిశోధన చేపట్టవలసి ఉందని ఆయన అన్నారు. ఈ వ్యాసరచన పోటీల ద్వారా విద్యార్థులు తమ జ్ఞానం, విశ్లేషణాత్మక సామర్థ్యం మరియు ఒప్పించే శైలిని ప్రదర్శించడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.

విద్యార్థుల ప్రతిభను పెంపొందించడానికి, అభివృద్ధి చేయడానికి, ఉపయోగించుకోవడానికి మరియు పదును పెట్టడానికి మరియు రాజ్యాంగం, చట్టం మరియు ఎన్నికల ప్రక్రియపై వారి అవగాహనను వ్యక్తీకరించడానికి ఈ వార్షిక వ్యాసరచన పోటీలు అవకాశం కల్పిస్తాయని ఎలక్షన్ కమిషనర్ శ్రీ రాజీవ్ కుమార్ అన్నారు.ఎన్నికల చట్టాలు ఓటర్లు, రాజకీయ పార్టీలు మరియు అభ్యర్థులకు హక్కులతో పాటు బాధ్యతలను కూడా కల్పిస్తాయని ఆయన తెలియజేశారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పోల్గోవాలని ఆయన కోరారు.

పోటీల్లో పాల్గొనే విద్యార్థులు సాధారణంగా ప్రజాస్వామ్య ప్రక్రియలో ఇమిడి వుండే వివిధ రాజ్యాంగ, చట్టపరమైన అంశాలతో పాటు ఎన్నికల నిబంధనలకు ప్రాధాన్యత ఇస్తూ తమ ఎంట్రీలను పంపాలని ఎన్నికల కమిషనర్ శ్రీ అనూప్ చంద్ర పాండే అన్నారు. ఈ పోటీల ద్వారా న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల నుంచి నాణ్యమైన ఎంట్రీలు అందుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

జాతీయ వ్యాసరచన పోటీకి సంబంధించిన పూర్తి వివరాలు ప్తబిబిజూబ:// లిలిలి.వఞతివబబజీఎ.నీతీణ/ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంటాయి. ఈ వెబ్‌సైట్ 2 అక్టోబర్, 2021 నుంచి పనిచేస్తుంది.

# నిర్భయ నిధి నిధుల వినియోగ ఉన్నతస్థాయి కమిటీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 2:నిర్భయ నిధుల వినియోగం కోసం ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ 2021 సెప్టెంబర్ 30 వ తేదీన మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన సమావేశం అయ్యింది. బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, నాగాలాండ్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లలో డిఎన్ఏ విశ్లేషణ, సైబర్ ఫోరెన్సిక్ తో పాటు సంబంధిత సౌకర్యాలను మెరుగుపరచాలని కమిటీ హోం మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేసింది. దీనికోసం 17.31 కోట్ల రూపాయలను కేటాయించాలని కమిటీ సూచించింది. నిర్భయ నిధుల కింద 24 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లలో డిఎన్ఏ విశ్లేషణ సౌకర్యాలను మెరుగుపరచాలని సమావేశం సూచించింది.

దేశంలో 9797.02 కోట్ల రూపాయల ఖర్చుతో అమలవుతున్న పథకాలు/ కార్యక్రమాలను ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో సమీక్షించింది. నిర్భయ నిధులతో మహిళల కోసం వన్ స్టాప్ సెంటర్లు, పోలీస్ స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్కులు, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థ, సురక్షిత నగర ప్రాజెక్టులు, మహిళా హెల్ప్‌లైన్ లాంటి కార్యక్రమాలు/పథకాలు అమలు చేయాలని నిర్ణయించారు. ఉన్నతస్థాయి కమిటీ సమీక్షించిన తరువాత ఈ కార్యక్రమాలు/పథకాలను నేరుగా లేదా రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలు / అమలు చేసే ఏజెన్సీల ద్వారా సంబంధిత మంత్రిత్వ శాఖలు అమలు చేయడం జరుగుతుంది.

మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ, న్యాయ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖ, గృహ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు ఉత్తర ప్రదేశ్ మరియు రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు హాజరయ్యారు.

దేశంలో మహిళల భద్రత కల్పించి, రక్షణ పెంపొందించడానికి ఉద్దేశించిన కార్యక్రమాల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం 'నిర్భయ ఫండ్' పేరిట నిధులను అందుబాటులో ఉంచింది. ఈ నిధులు మురిగిపోవు. నిర్భయ ఫండ్ కింద ప్రతిపాదించిన పథకాలు / కార్యక్రమాలను అమలు చేయుడానికి అందిన ప్రతిపాదనలను ఉన్నతస్థాయి కమిటీ పరిశీలించి నిధుల కోసం ప్రతిపాదనలను సిఫార్సు చేస్తుంది. ఆమోదించబడిన ప్రాజెక్టుల అమలు పురోగతిని పర్యవేక్షిస్తుంది

# యాదాద్రీశుడికి వైభవంగా లక్ష పుష్పార్చన

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 2:: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం సర్వేషామేకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో అర్చక బృందం, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు స్వామి వారి బాలాలయంలో అతరంగికంగా నిర్వహించారు.

పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం సుమారు రెండు గంటలు లక్ష పుష్పార్చన పూజలు కొనసాగాయి. ప్రతి ఏకాదశి రోజున యాదాద్రి క్షేత్రంలో స్వామిని లక్ష పుష్పాలతో అర్చనలు జరుపడం ఆలయ సంప్రదాయం. ఈ లక్ష పుష్పార్చన పూజల్లో దేవస్థాన ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, వేద పండితులు, అర్చక బృందం పర్యవేక్షకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



# హుజురాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు.. టీఆర్ఎస్ కు ధీటుగా రేవంత్ స్కెచ్



హుజురాబాద్, అక్టోబర్ 2:హుజూరాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు? అన్న ఉత్కంఠకు తెర పడింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్ పేరును పార్టీ ఖరారు చేసింది. తొలి నుంచి మాజీ మంత్రి కొండా సురేఖను ఎంపిక చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే, అనూహ్యంగా నిర్ణయం మారుకుంది. అభ్యర్థి ఎంపికపై శుక్రవారం జరిగిన చర్చలో పలువురి పేర్లు పరిశీలనకు వచ్చినా.. అధికార టీఆర్ఎస్ తరఫున ఆ పార్టీ విద్యార్థి నాయకుడిని అభ్యర్థిగా నిలబెడుతున్న నేపథ్యంలో బల్మూరు వెంకట్ పేరును కాంగ్రెస్ ముఖ్యులు ప్రతిపాదించారు. పార్టీ నేతల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ఆయన పేరును ఖరారు చేశారు. శనివారం టీపీసీసీ చేపట్టనున్న విద్యార్థి, నిరుద్యోగ సైరన్ సందర్భంగా వెంకట్ పేరును ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా వెంకట్ రెండు పర్యాయాలుగా పనిచేస్తున్నారు. వెంకట్ పేరును ప్రతిపాదించే ముందు పార్టీ ముఖ్యులు ఆయనను పిలిచి అభిప్రాయం తీసుకున్నారు.

టీఆర్ఎస్ తరుపున గెల్లు శ్రీనివాస్ బరిలో ఉండా.. బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో టీఆర్ఎస్ గుర్తుపై పోటీ చేసిన ఈటల.. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో బీజేపీలో చేరారు. దీంతో ఉప ఎన్నికల్లో బీజేపీ గుర్తుపై పోటీ చేస్తున్నారు. ఇక, గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దాదాపు 60 వేల ఓట్లు సాధించి.. రెండో స్థానంలో నిలిచింది. దీంతో ఇప్పుడు ఆ ఓట్లను కాపాడుకుంటుందా? లేదా? అన్నది ఉత్కంఠగా మారింది. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న తొలి ఉప ఎన్నిక కావడంతో కాంగ్రెస్ పార్టీ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

# రాష్ట్ర పెత్తనమంతా రెండిళ్లకే పరిమితం అంటే కుదరదు : పవన్ కల్యాణ్



రాజమండ్రి, అక్టోబర్ 2:: తన ప్రాణాలు పణంగా పెట్టి ప్రజలకు అండగా ఉండేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్ర వరంలో జరిగిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి శ్రమదానం చేసిన ఆయన అనంతరం బాలాజీపేటలో బహిరంగ సభలో పాల్గొన్నారు. తనను తొక్కే కొద్దీ పైకి లేస్తానని, అంతేగానీ వంగిపోవడం జరగదని పవన్ చెప్పారు. పనులు జరగకపోతే అడిగే హక్కు తమకు ఉంటుందని, ప్రజలకు ఉన్న ఈ హక్కును ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. కుల, మత, వర్గ రహిత సమాజజే తమ ఆకాంక్ష అని వెల్లడించారు.

శ్రమదానం చేయడం తనకు సరదా ఏమీ కాదని, రాజకీయం చాలా కష్టమైన ప్రక్రియ అని పవన్ కల్యాణ్ అన్నారు. 'నిలబడటానికి నేను ఎన్ని దెబ్బలు తిన్నానో మీకేం తెలుసు? ఒడిదుడుకులు, ఓటములు అధిగమించి నిలబడటానికే వచ్చా' అని ప్రకటించారు. ప్రజలు కట్టే పన్నులన్నీ ప్రభుత్వం వద్దకు వెళ్తాయని, ఆ డబ్బుతో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందన్నారు.

పచ్చి బూతులు తిట్టగానే తాను బెదిరిపోనని చెప్పిన పవన్.. 'నా గురించే ఆలోచిస్తే తిట్టిన వాళ్లను కింద కూర్చోబెట్టి నార తీసేవాడిని. ప్రజల కోసమే తిట్లు తింటున్నా. ఇంతకాలం ఎన్నో మానసిక అత్యాచారాలు భరించా, ఎన్నో మాటలు పడ్డా. నా సహనాన్ని తేలిగ్గా తీసుకోవద్దు' అని ప్రత్యర్థులను హెచ్చరించారు. సీఎం అంటూ అభిమానులు అరవడంతో దానికి కూడా పవన్ బదులిచ్చారు. 'పవన్ వస్తేనే పవర్ స్టార్ అనండి, సీఎం అయ్యాకే సీఎం అని పిలవడం. ఇప్పుడు జనసేనాని అనండి' అని అభిమానులకు చెప్పారు.

తాము బాధ్యతగా ఉంటామని స్పష్టం చేసిన పవన్ కల్యాణ్.. అధికార పార్టీ ఎమ్మెల్యేలకు కూడా అలాగే బాధ్యతగా ఉండాలని పోలీసులు, అధికారులు చెప్పాలన్నారు. ఏ కులంలో పుట్టాలో ఎంపిక చేసుకునే అవకాశం ఎవరికీ ఉండదని, కానీ ఎలా ప్రవర్తించాలన్నది మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. ఎవరో ఒకరు ఏదో అన్నారని ఒక కులాన్ని నిందించకూడదని చెప్పారు. ఒక కులాన్ని వర్గ శత్రువుగా ప్రకటించడం మంచిది కాదన్నారు. కులాల పేరిట కొట్లాటలతో ప్రజలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్ర పెత్తనం మొత్తం రెండు ఇళ్లకే పరిమితం అంటే కుదరదని, ప్రజాస్వామ్యంలో అణిచివేత మంచిది కాదని పవన్ పేర్కొన్నారు.

# మహాత్మాగాంధీకి ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి నివాళులు



మహబూబ్‌నగర్, అక్టోబర్ 2:మనమంతా జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడిచి రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి చేసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన జడ్చర్ల పట్టణంలోని పలు కూడళ్లలో గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసిఆర్ కూడా గాంధీజీ మార్గంలోనే నడుస్తున్నారని చెప్పారు.

కేసీఆర్ అహింసా మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఏడేండ్లుగా తెలంగాణలో శాంతియుత వాతావరణం నెలకొని ఉందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా శ్రీ సత్యేశ్వర సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

